క్లుప్తంగా

ముమ్మరంగా వరికోతలు



కొత్తపల్లి మండలంలో మెషీన్‌తో వరికోత

కొత్తపల్లి: నియోజకవర్గంలో ఖరీఫ్ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. నాట్లు ముందుగా వేసిన ప్రాంతాల్లో వరి పంట కోత దశకు చేరుకోవడంతో రైతులు పంటను ఒబ్బిడి చేసే పనిలో పడ్డారు. కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది 10150 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కోతలు జోరుందుకున్నాయి. రైతులు యంత్రాలతో కోత కోసేందుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో ఇప్పటికే 2000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జోగిరాజు సూచించారు.

హరిత దీపావళి చేద్దాం

సామర్లకోట: పర్యావరణహితమైన దీపావళిని సంతోషకరంగా, శబ్ద కాలుష్యం లేకుండా జరుపుకొందామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఆదివారం దీపావళిని పురస్కరించుకొని శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బాణసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తేలికపాటి వస్త్రాలను ధరించాలని, ఎకో ఫ్రెండ్లీగా పండగ జరుపుకోవాలని, పర్యావరణ హితంగా మెలగాలని ఆయన సూచించారు.

నరకాసుర బొమ్మ దహనం



విరవాడలో నరకాసుర బొమ్మ దహనం చేస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ సభ్యులు

పిఠాపురం: మద్యపాన నిషేధంలో భాగంగా శనివారం పిఠాపురం మండలం విరవాడలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బ్రాందీ నరకాసుర బొమ్మ దహనం చేశారు. మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్. సూర్యనారాయణ మద్యపానం, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ సభ్యులు కె.శివ, కె.నాగవెంకటలక్ష్మి, సీకోలు అప్పలరాజు, కె. సూర్యాకాంతం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: బాణసంచా విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అడిషనల్ డీఎస్పీ అప్పారావు సూచించారు. మండలంలోని వాకతిప్ప, కొండెవరం, ఉప్పాడ, మూలపేట గ్రామాల్లోని మందుగుండు సామగ్రి షాపులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల వద్ద తప్పనిసరిగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి షాపు వద్ద నీరు, ఇసుక, ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టపాసుల టైమొచ్చిందోచ్

- విక్రయాలకు బాణసంచా సిద్ధం
- దీపాలతో కార్తికానికి స్వాగతం
- ప్రమిదలకు పెరిగిన డిమాండ్



సామర్లకోటలో ప్రమిదలు విక్రయిస్తున్న మహిళలు



వేట్లపాలెంలో బాణసంచా విక్రయాలు

సామర్లకోట: దీపావళి పండగకు అన్నీ సిద్ధమైపోయాయి. పట్టణ పరిధిలో 11, మండల పరిధిలో 13 బాణసంచా దుకాణాలకు అనుమతులిచ్చారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 11, వేట్లపాలెంలో 11, ఉండూరులో ఒకటి, పనసపాడులో ఒక దుకాణంలో విక్రయాలు సాగుతున్నాయి. ఆదివారం విక్రయాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

దీపాలతో కార్తికానికి స్వాగతం

దీపావళి సందర్భంగా మహిళలు ఇంటి వద్ద మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి కార్తిక మాసానికి స్వాగతం పలకనున్నారు. కార్తికం అంతా దీపాలు వెలిగిస్తారు కాబట్టి ప్రమిదలకు గిరాకీ ఏర్పడింది. దీపావళి దివిటీలకు గోగుకర్రలు, చెరకు గడల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి ప్రమిదల దిగుమతి

స్థానిక కుమ్మర్లు ప్రమిదల తయారీకి దూరంగా ఉండటంతో కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పింగాణీ ప్రమిదలు దిగుమతి చేసుకొని స్థానిక వ్యాపారులు విక్రయిస్తున్నారు. కానీ మట్టి ప్రమిదలకు స్థానికులు ప్రాధాన్యమివ్వడంతో వాటికి డిమాండ్ పెరిగింది. కుమర్లు మట్టి చిప్పబుడ్లతో పాటు ప్రమిదలను తయారు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



గోర్సలో పల్లెనిద్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పిఠాపురంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోర్సలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు, ఎంపీటీసీ కొండపల్లి సూర్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పూజ్యం సతీష్‌బాబు, రొంగల అప్పారావు, పెదిరెడ్ల కాశీ, సచివాలయ కన్వీనర్లు మద్దాల ఏసుబాబు, వాసంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు మారాలంటే జగనే కావాలి

పిఠాపురం: పేదల బతుకులు మారాలంటే ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నేత గండేపల్లి బాబీ అన్నారు. పిఠాపురం పట్టణంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు బొజ్జా దొరబాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, పాదగయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, కౌన్సిలర్ ఆరుగుల వరలక్ష్మి తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. 5వ వార్డు సచివాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న ఫ్లెక్సీని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. పార్టీ సానుభూతి పరుల ఇళ్ల వద్ద నాయకులు రాత్రికి నిద్ర చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు బిరుసు వర్ష, పాలిక జ్యోతి, మహిళా అధ్యక్షురాలు రేలా నాగమణి, యువజన అధ్యక్షుడు పాలిక ప్రవీణ్, పార్టీ నాయకులు పితాని కాశీ, కండేపల్లి ఆనంద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

- విరాళాలు, టిక్కెట్ల ద్వారా రూ. 2.77లక్షల ఆదాయం



భక్తుల పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి రూ.2,70,577 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. భక్తులు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, భక్తులకు ప్రసాద వితరణ చేసినట్టు ఈఓ తెలిపారు.

యథేచ్ఛగా మోటారు సైకిళ్ల చోరీలు



మోటారు సైకిళ్ల విడి భాగాల చోరీపై సమాచారం సేకరిస్తున్న పోలీసులు

సామర్లకోట: ఇటీవల కాలంలో మోటారు సైకిళ్ల చోరీలు పెరిగి పోతున్నాయి. ఇంటిలో మోటారు సైకిల్ పెట్టుకోవడానికి అవకాశం లేని అనేక మంది ఇంటి ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసి తాళాలు వేసుకుంటున్నారు. అయినప్పటికీ వాటి చోరీలతో పాటు, టైర్లు, బ్యాటరీలను దొంగలు ఎత్తుకుపోతున్నారు. ఇటీవల కాలంలో స్థానిక చిన్నవీధిలో ఈ చోరీలు పెరగడంతో పోలీసులు స్థానికుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తుండగా, అయినప్పటికీ వాటికి చిక్కకుండా దొంగలు జాగ్రత్తపడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. రాత్రివేళ పోలీసుల పెట్రోలింగ్ ఉండాలని వారు అభ్యర్థిస్తున్నారు. ఆ సమయంలో పెట్రోలింగ్ వాహనాల సైరన్ల వల్ల దొంగలు జారుకుని అవి వెళ్లాక మళ్లీ వారి పని మొదలుపెడుతున్నారని చెప్తున్నారు. ఎవరి జాగ్రత్తలు వారు తీసుకున్నా దొంగలను పట్టుకోవడంలో ఇతర మార్గాలను అన్వేషించాలని స్థానికులు కోరుతున్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

కొత్తపల్లి: సారా బట్టీలపై దాడి చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు శనివారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని కొమరగిరి శివారు విద్యుత్ కర్మాగారం సమీపంలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. సారా బట్టీలను ధ్వంసం చేసి సంఘటన స్థలం నుంచి 20 లీటర్ల సారా, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న వ్యక్తి పరారైనట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి మహిళకు గాయాలు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లిలో శనివారం విద్యుత్ స్తంభం విరిగిపడి ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... నాగులపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి సూర్యచక్రం వీధిలో నడిచి వెళుతుండగా ఆమెపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆమెకు గాయాలు కావడంతో బంధువులు చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గత కొంతకాలంగా స్తంభం శిథిలపై ప్రమాదకరంగా మారింది. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఏ ఒక్కరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్వచ్ఛత.. మన బాధ్యత

- జగనన్న స్వచ్ఛ సంకల్పం సాధనకు ప్రణాళిక
- హౌసింగ్ చైర్మన్ దొరబాబు స్వీయ ఆలోచన
- పరిశుభ్రంగా మారుతున్న పట్టణ, గ్రామీణ ప్రాంతాలు



పంచాయతీలో మేజర్ డ్రెయిన్ పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



పెద్దాపురం మున్సిపాలిటీలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు

పెద్దాపురం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యకర వాతావరణం కోసం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించే క్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు బృహత్ ప్రణాళిక రూపొందించి, దాని అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. స్వచ్ఛత మన బాధ్యత పేరుతో అమలు చేస్తున్న కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం, సామర్లకోట పట్టణంలోని వార్డులు, రెండు మండలాల్లోని ఆయా గ్రామాలు చెత్త రహితంగా అద్దాల్లా మార్చేందుకు చర్యలు చేపట్టారు.

ప్రజల్లో స్ఫూర్తి నింపుతూ..

స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఆయా వార్డులు, గ్రామాల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి పట్టణంలోని శానిటరీ విభాగ అధికారులు, పంచాయతీల్లోని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసి పారిశుధ్య పనుల మెరుగుకు చర్యలు చేపట్టారు. తడి, పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. ప్రతి డ్రైన్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టారు.

స్వచ్ఛ అవార్డులు

ఏటా నిర్వహించే స్వచ్ఛ సంకల్పం అవార్డులకు నియోజకవర్గంలో రెండు మున్సిపాల్టీలు, పంచాయతీలు పోటీ పడుతూ అవార్డులు సాధించాయి. గతంలో పెద్దాపురం పట్టణంతో పాటు మండలంలోని జి.రాగంపేట, చదలాడ, సామర్లకోట మండలంలో ఉండూరు, అచ్చంపేట పంచాయతీలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి.

ప్రజా సహకారంతోనే ఆరోగ్య పరిరక్షణ



ప్రజల సహకారంతోనే ప్రజా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుంది. చెత్తను సేకరించే పారిశుధ్య కార్మికులకు ప్రజలు మరింత సహకారాలు అందించాలి. డ్రైన్ పూడిక తీత, చెత్త తొలగింపు పనులు పూర్తయిన వెంటనే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

– దావీదురాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పెద్దాపురం

గ్రామాల పరిశుభ్రతకు చర్యలు



మండదంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాం. స్వచ్ఛత బాధ్యత నినాదంతో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ తద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ పంచాయతీలో పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పారిశుధ్య పనులు మరింత మెరుగుపరుస్తున్నాం.

– బి.అశోక్‌కుమార్, ఎంపీడీఓ, పెద్దాపురం